సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 7 । నవంబర్ । 2023



సర్వర్ సమస్యతో నిరీక్షణ

ప్రజల నుంచి వినతులను స్వీకరించడానికి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే జన గన్నకు చెబుదాం కార్యక్రమానికి ఈ వారం సర్వర్ సమస్య ఇబ్బంది పెట్టింది. - IIలో



బాక్సింగ్ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ పురుష బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. - IIలో

నేడు జిల్లాలో రెండు చోట్ల జేఏఎస్ శిబిరాలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో బత్తిలి పీహెచ్‌సీ పరిధిలో చినబగ్గ ప్రాథమిక పాఠశాలలో, మాదలింగి పీహెచ్‌సీ పరిధి కేపీడీ వలన గ్రామ సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డా.బి.జగన్నాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయిని అవతారమెత్తిన ఆర్డీఓ

- విద్యార్థులకు పాఠాల బోధన



ఉపాధ్యాయినిగా మారి విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఆర్డీఓ లావణ్య

పాలకొండ రూరల్: ఆర్డీఓ ఎం.లావణ్య కాసేపు ఉపాధ్యాయినిగా మారారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి వారిని ఆకర్షించారు. వివరాల్లోకి వెళ్తే.. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని చిన్నమంగళాపురం గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆర్డీఓ సోమవారం సందర్శించారు. పిల్లల విద్యా ప్రామాణాలు తెలుసుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో చాక్‌పీస్ పట్టుకుని బోర్డుపై పాఠ్యాంశాలను రాస్తూ బోధించారు. విద్యార్థులు ఆమెతో మమేకమయ్యారు. ఆర్డీఓ ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న వనరులు వినియోగిస్తూ మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు.

వారం రోజుల్లో నీటి వనరుల లెక్కింపు

- జేసీ మయూర్ అశోక్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: గ్రామాల్లో నీటి వనరుల లెక్కింపు ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. ఈ మేరకు మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులు, ఎంఈఓలతో సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ, యాప్ డౌన్‌లోడ్, పంచాయతీరాజ్ భవనాలు, జగనన్నకు చెబుదాం, గృహనిర్మాణం, నీటి వనరుల లెక్కింపు, సచివాలయాల వద్ద బోర్డుల ఏర్పాటు తదితర అంశాలపై మండలాలా వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సుమారు రెండున్నర లక్షల మందికి పైగా వైద్యసేవలు పొందారన్నారు. మెరుగైన వైద్యం కోసం ఎంపిక చేసిన రిఫరల్ కేసులను పర్యవేక్షించి, డిసెంబర్‌లోగా వారికి వైద్యసేవలు అందేలా చూడాలని ఆదేశించారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది దీనికి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి సచివాలయం వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. వీసీలో జిల్లా కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత



బాధిత మహిళలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

రాజాం సిటీ : పట్టణ పరిధిలో పొనుగుటివలస గ్రామానికి చెందిన ఆర్పీ చేసిన అవకతవకలపై రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు సోమవారం విచారణ చేపట్టారు. బాధితులను రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయానికి పిలవడంతో పాటు వివరాలు సేకరించారు. ఇదే సమయంలో మెప్మా అధికారులు, ఆర్పీని కూడా పిలిచి విచారణ చేపట్టారు. విషయం కొలిక్కి రాకపోవడంతో గ్రామంలో క్షేత్ర స్థాయిలో విచారణ చేపడతామని సీఐ వెల్లడించి, పొదుపు సంఘాల బాధిత మహిళలను ఇంటికి వెళ్లిపోమని సూచించారు. ఈ సమయంలో ఆర్పీ బంధువు స్టేషన్ వద్దకు వచ్చి బాధిత మహిళలపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు ఒక వ్యక్తిని చంపుతామని హెచ్చరించాడు. దీంతో బాధితులు ఆందోళనకు దిగారు. ఆర్పీ బంధువు దురుసుతనంపై గట్టిగా నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకుంది. పోలీసులు జోక్యం చేసుకుని బాధితులను అదుపుచేసి, నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

హాకీ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని

చీపురుపల్లి రూరల్(గరివిడి): జాతీయ స్థాయి హాకీ పోటీలకు గరివిడి కేజీబీవీ విద్యార్థిని ఎం.వనజ ఎంపికైనట్లు ఎస్‌ఓ ధనలక్ష్మి సోమవారం తెలిపారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. వనజను కేజీబీవీ సిబ్బంది అభినందించారు.

అన్నదాతకు ఆర్థిక భరోసా



రైతే రాజు అనే నినాదం నిజం చేసేలా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాలా అండగా ఉంటూ ఆర్థిక భరోసానిస్తోంది. ఇందు కోసం రైతుభరోసా నుంచి ఆర్‌బీకేల వరకు అన్నదాతకు అన్ని విధాలా సాయం చేస్తూ సాగుకు భరోసా కల్పిస్తోంది.

- నేడు రైతు భరోసా నిధుల జమ
- పీఎం కిసాన్ నిధులు విడుదల
- 1,45,954 మంది రైతులకు లబ్ధి
- రైతుల ఖాతాల్లో జమ కానున్న మొత్తం రూ.59.72 కోట్లు



పార్వతీపురం టౌన్:

అన్నదాతకు సాగు పెట్టుబడి కోసం ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ పథకం ఐదవ విడత ఆర్థిక సాయం రైతుల ఖాతాల్లో మంగళవారం జమ కానుంది. పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేలు, కొండపోడు (ఆర్ఓఎఫ్ఆర్) రైతు భరోసా ద్వారా రూ.2 వేల చొప్పున. జిల్లా వ్యాప్తంగా 1,45,954 మంది రైతులకు రూ.59.72 కోట్లు జమ చేయనున్నారు. సాయం అందుకుంటున్న వారిలో 18,803 మంది కొండపోడు వ్యవసాయ రైతులు కూడా ఉన్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఆర్థిక సాయం ఎరువుల కొనుగోలుకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ఆరంభమైన జూన్ నెలలో ఒక్కో రైతుకు రూ.7,500 చొప్పున జమ చేశారు. అప్పట్లో 1,42,930 మంది రైతులకు మేలు జరిగింది. ఇప్పుడు 1,45,954 మంది రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరనుంది. సాగు సమయంలో రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాయి. నేడు పీఎం కిసాన్ ద్వారా మరో రూ.2000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. రైతు భరోసా ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమం పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో, గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద మండల స్థాయి అధికారు లతో మంగళవారం నిర్వహించనున్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

రైతుభరోసా, పంటల బీమా లబ్ధి, సున్నా వడ్డీ వంటి పథకాలు వర్తించాలంటే రైతులందరూ తాము సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ–క్రాప్ చేయించుకోవడంతో పాటు, తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలి. అన్ని రకాల వ్యవసాయ సంబంధిత పథకాలు పొందడానికి, ప్రకృతి వైపరీత్యాల వలన దెబ్బతిన్న పంటలకు పరిహారం పొందాలన్నా ఈ–కేవైసీ తప్పనిసరి. జిల్లా వ్యాప్తంగా 3 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వీటికి సంబంధించి ఈ–కేవైసీ చేయించుకున్న వారికి పీఎం కిసాన్ సొమ్ము జమ కానుంది.

ఐదేళ్లుగా రైతు భరోసా వివరాలు

సంవత్సరం	రైతు కుటుంబాలు	జమ చేసిన నిధులు
2019-20	107729	రూ.145.43 కోట్లు
2020-21	129027	రూ.174.19 కోట్లు
2021-22	134657	రూ.181.79 కోట్లు
2022-23	139505	రూ.188.04 కోట్లు
2023-24 (మొదటి విడత)	142930	రూ.107.19 కోట్లు

జిల్లాకు రూ. 59.72 కోట్లు



పార్వతీపురం మన్యం జిల్లాలో రైతులకు రైతుభరోసా – పీఎం కిసాన్ సాయం కింద 1,45,954 మంది రైతుల ఖాతాల్లో రూ.59.72 కోట్లు జమ కానున్నాయి. ఈ కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో, గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద మండల స్థాయి అధికారులతో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం.

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం

మండలాల వారీగా ఐదో ఏడాది రెండవ విడత జమ కానున్న నిధులు

మండలం	రైతులు	జమ కానున్న నిధులు
పాలకొండ	9686	రూ.4.02 కోట్లు
సీతంపేట	13343	రూ.5.37 కోట్లు
భామిని	7492	రూ.3.02 కోట్లు
వీరఘట్టం	10978	రూ.4.45 కోట్లు
సాలూరు	11907	రూ.4.81 కోట్లు
పాచిపెంట	6964	రూ.2.82 కోట్లు
మక్కువ	8378	రూ.3.43 కోట్లు
కురుపాం	9119	రూ.3.68 కోట్లు
గుమ్మలక్ష్మీపురం	8359	రూ.3.34 కోట్లు
జియ్యమ్మవలస	10212	రూ.4.18 కోట్లు
కొమరాడ	8853	రూ.3.59 కోట్లు
గరుగుబిల్లి	8654	రూ.3.51 కోట్లు
పార్వతీపురం	11375	రూ.4.76 కోట్లు
సీతానగరం	10411	రూ.4.33 కోట్లు
బలిజిపేట	10223	రూ.4.33 కోట్లు

దరఖాస్తులు సమర్పించాలి

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ ఎగ్జామినేషన్స్ – 2023 కోసం దరఖాస్తు చేసుకొన్న దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సమర్పించి, డీఈఓ లాగిన్‌లో ఆమోదింపజేసుకోవాలని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఓ లాగిన్‌లో ఆమోదింపజేసుకోని వారు పరీక్ష రాసేందుకు అనర్హులుగా పరిగణించబడతారని తెలిపారు.

గడువు పెంపు

పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌కు సంబంధించి ఏప్రిల్ 2024లో పరీక్షలు రాసే అభ్యర్థులు పరీక్ష ఫీజును చెల్లించేందుకు ఈ నెల 30వరకు గడువును పెంచినట్లు డీఈఓ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఏపీటీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌లోగాని, వెబ్‌సైట్ అందించిన 'పేమెంట్ గేట్‌వే లింక్'ద్వారా చెల్లించవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజన స్పందనకు 62 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 62 వినతులు వచ్చాయి. విద్యుత్ స్తంభాలు మార్పు చేయాలని కడగండికి చెందిన మల్లేశ్వరరావు కోరారు. జొనగకు చెందిన కుమారి కుట్టు మిషన్ ఇప్పించాలన్నారు. జజ్జువకు చెందిన బాలేషు పవర్‌వీడర్ కావాలని కోరారు. మైక్‌సెట్ కొనుగోలుకు లోన్ ఇప్పించాలని గదబవలస గ్రామస్తుడు రాజ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. సంకిలికి చెందిన అద్దాయి తమ గ్రామానికి సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని మకనాపురం శ్రీనివాసరావు కోరారు. చింతమానుగూడ గ్రామస్తులు గ్రామంలో సామాజిక భవనం నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. భాషా వలంటీర్ పోస్టు ఇప్పించాలని పొంజాడకు చెందిన సవర సుబ్బారావు కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మంగవేణి, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి పాల్గొన్నారు.

తెర్లాంలో 'జగనన్నకు చెబుదాం' రేపు

తెర్లాం: కలెక్టర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న జగనన్నకి చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులంతా కలిపి విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి సంబంధించి మండలంలోని అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులంతా ఆ రోజున తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో పాటు, గతంలో మండలంలో నిర్వహించిన జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతుల్లో ఎన్ని పరిష్కరించారు, ఇంకా పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయనే దానిపై వివరాలు తీసుకొని రావాలన్నారు.

జోరందుకుంటున్న విమానాశ్రయ పనులు





విమానాశ్రయ నిర్మాణం కోసం చదును చేసిన భూమి, (ఇన్‌సెట్లో)విమానాశ్రయ నిర్మాణానికి సామగ్రి సిద్ధం చేస్తున్న ఎల్అండ్‌టీ సంస్థ

భోగాపురం: భోగాపురం మండలంలో నూతనంగా నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు జోరందుకున్నాయి. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే జీఎమ్ఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీఎమ్ఆర్ సంస్థ విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన పలు పనులను సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఎల్ అండ్‌టీ, జీఎమ్ఆర్ సంస్థలు సంయుక్తంగా పలు పనులకు ఈ నెల 1వ తేదీన శంకుస్థాపన చేశారు. అనంతరం మరడపాలెం సమీపంలో భూమి చదును పనులు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి విమానాశ్రయ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా జీఎమ్ఆర్ ముందుకు సాగుతోంది. పనులను జీఎమ్ఆర్ సంస్థ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ 'ఆరోగ్య సురక్ష' అందించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రతీ ఒక్కరికి ఆరోగ్య సురక్ష పథకం ద్వారా మెరుగైన చికిత్స డిసెంబర్ 31లోగా అందించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్ష నిర్వహిస్తూ.. పథకాన్ని విజయవంతం చేసినందుకు కలెక్టర్లను ఆయన అభినందించారు. సమీక్షలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అయిదు అంచెల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఐదవ అంచె కొనసాగుతుందని, మెరుగైన చికిత్సకు సిఫార్సు చేసిన 90వేల మందిలో ఇంతవరకు 13,580 మందికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రులలో చికిత్సలను అందించడం జరిగిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించని వ్యాధులకు జిల్లా, బోధనాస్పత్రులో చికిత్సను అందించాలన్నారు. జనవరి 2024 నుండి దీనికి కొనసాగింపుగా నెలకు నాలుగు చొప్పున మండలం, పట్టణాలలో ప్రతీ వారం ఒక గ్రామ, పట్టణ సచివాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ప్రతీ సచివాలయంలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతున్న వారి వివరాలను ప్రదర్శించాలని తెలిపారు. వారంలో ఒక రోజు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రతి ఇంటిని సందర్శించాలని తెలిపారు. ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిషాంత్‌కుమార్, డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ నిధుల జమ

- 2,63,394 మందికి రూ.108.42 కోట్లు జమ చేయనున్న ప్రభుత్వం

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ పథకానికి సంబంధించి 2023 - 24 సంవత్సరానికి రెండో విడత 2,63,394 మంది రైతులకు రూ.108.42 కోట్ల నిధులు వారి ఖాతాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జమ చేయనున్నారని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్‌కు సంబంధించి 2,59,519 మంది రైతులకు రూ.51.9 కోట్లు, వైఎస్సార్ రైతు భరోసా పథకానికి సంబంధించి భూ యాజమానులు 2,59,519 మందికి రూ.53.84 కోట్లు, దేవదాయ భూమి కౌలు చేసే రైతులు ఐదుగురికి, అటవీ భూమి సాగుదారులు 1113 మందికి రూ.0.45 కోట్లు, భూమి లేని సాగుదారులు 2757 మందికి రూ.2.23 కోట్లు మొత్తంగా 2,63,394 మందికి రూ.108.42 కోట్లు నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి.

సత్తా చాటుదాం...

- సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దాం
- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, చిత్రంలో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు:

పట్టణంలో వైఎస్సార్ కూడలి వద్ద బుధవారం జరగబోయే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయడం ద్వారా పార్టీ సత్తా చాటుదాం అని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర గృహంలో బస్సు యాత్రకు సంబంధించి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులతో సోమవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలను ఈ యాత్ర ద్వారా వివరించనున్నామని వెల్లడించారు. పార్టీ శ్రేణులంతా కార్యక్రమం విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు సైతం ఆలోచించేలా యాత్రను దిగ్విజయం చేద్దామన్నారు. పల్లె నుంచి పట్టణం వరకు వైఎస్సార్‌సీపీ సైన్యం యాత్ర విజయవంతానికి కృషి చేయాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇదే తొలి యాత్ర అయినందున మిగతా నియోజకవర్గాలకు రోల్‌మోడల్‌గా ఉండేలా యాత్ర జరగాలన్నారు.

యాత్ర సాగేదిలా...

యాత్ర బుధవారం ఉదయం మెంటాడ మండలం పోరాం సచివాలయం వద్ద ప్రారంభమై, మేడపల్లి సంతతోట మీదుగా మధ్యాహ్నం బూసాయవలసకు చేరుకుంటుందని తెలిపారు. అక్కడ విరామం అనంతరం సాలూరు వైఎస్సార్ కూడలి వద్దకు మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంటుందన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి సాలూరు వచ్చినపుడు కొట్టక్కి బ్రిడ్జి నుంచి సాలూరు వరకు ఇసుకేస్తే రాలనంత జనం తరలివచ్చారని గుర్తు చేశారు. నాటి యాత్రను తలపించేలా నేడు సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. యాత్రను విజయవంతం చేసి సగర్వంగా ఎన్నికలకు వెళ్దామని పేర్కొన్నారు. మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ సమన్వయంతో సమష్టిగా పని చేసి యాత్రను విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాహనాల రూట్‌మ్యాప్ ఇలా..

పాచిపెంట మండలం నుంచి వచ్చే వాహనాలు వీఆర్ఎస్ కాలనీ, గరల్స్ హైస్కూల్ సమీపంలో, మక్కువ, సాలూరు మండలాలకు సంబంధించి మామిడిపల్లి నుంచి వచ్చే వాహనాలు ఏఎంసీ కార్యాలయం, రైతుబజార్‌ల వద్ద, బాగువలస మీదుగా వచ్చే వాహనాలు మక్కువ బైపాస్ రోడ్డు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో, మెంటాడ మండలం నుంచి వచ్చే వాహనాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో పార్కింగ్ చేయాలని పార్టీ నాయకులు సూచించారు.

ప్రజాసంకల్పయాత్ర సంబరం



ప్రజాసంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మెంటాడ మండలం పోరాంలో జరిగిన సంబరాల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు. -మెంటాడ

క్లుప్తంగా

రూరల్ పోలీస్ స్టేషన్ పరిశీలన



నూతనంగా నిర్మించిన రూరల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన రూరల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై నిర్వాహకులను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.2.5 కోట్లతో నిర్మించిన రూరల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట సీఐ ధనుంజయ నాయుడు, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.

మహిళలు రాణించాలి



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, అరబిందో ప్రతినిధులు

విజయనగరం: మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. అరబిందో ఫార్మసీ ఫౌండేషన్ సహకారంతో ధీరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఉచితంగా నిర్వహించిన టైలరింగ్ శిక్షణలో శిక్షణ పొందిన 60 మంది మహిళలకు మంత్రి బొత్స నివాసంలో సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో అరబిందో ఫార్మసీ వారు రూ.7.50 లక్షలను సీఎస్ఆర్ ప్రాజెక్ట్‌కు కేటాయించడం అభినందనీయమన్నారు. ఇటువంటి అవకాశాలను మహిళలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అరబిందో ఫార్మసీ హెచ్ఆర్ కమలాకర్‌రెడ్డిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో ధీరా ఫౌండేషన్ సీఈఓ చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో టీచర్ అవతారమెత్తిన పీవో



విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న పీవో కల్పనకుమారి

సీతంపేట: మండలంలోని మల్లి గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి సోమవారం సందర్శించారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ జిల్లాలోని పలు పాఠశాలలకు దత్తత అధికారులను నియమించడంలో భాగంగా మల్లి పాఠశాలను ఆమె పరిశీలించి ఉపాధ్యాయిని అవతారమెత్తారు. వివిధ సబ్జెక్టులలో విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున బాగా చదువుకోవాలని విద్యార్థులకు, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

అండర్ 17 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్ బాల్ రాష్ట్ర జట్లు ఇవే

ఒంగోలు: అండర్–17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ అంతర్ జిల్లాల పోటీల పరిశీలకుడు జగదీశ్వరరెడ్డి ప్రకటించారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. పరిశీలకులు జగదీశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు సీహెచ్ సత్యనారాయణ (విజయనగరం), కె.గోపాల్‌రెడ్డి (అనంతపురం), కృష్ణకుమార్ (కృష్ణాజిల్లా) ఈ రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జట్లు త్వరలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. బాలుర రాష్ట్ర జట్టులో విజయనగరం జిల్లాకు చెందిన పి.జనార్దన రావు, డి.రాఘవ, కె.రోహిత్ ఉన్నారు. అలాగే బాలికల జట్టులో విజయనగరం జిల్లాకు చెందిన టి.ప్రశాంతి, బి.సుప్రియ, పి.హైమావతి, స్టాండ్‌బైగా పి.చైతన్యకుమారి ఎంపికయ్యారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹180

సర్వర్ సమస్యతో నిరీక్షణ

● స్పందనకు 257 వినతులు



అర్జీలు వింటున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ప్రజల నుంచి వినతులను స్వీకరించడానికి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఈ వారం సర్వర్ సమస్య ఇబ్బంది పెట్టింది. కార్యక్రమానికి వచ్చిన వినతులను జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయాలతో లింక్ చేసి నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే సోమవారం దాదాపు రెండు గంటలపాటు ఏర్పడిన సాంకేతిక సమస్య వల్ల ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలు క్యూలో నిరీక్షించాల్సి వచ్చింది. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎస్.డి.అనిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సుదర్శన దొర, సమబాల, జిల్లా అధికారులు వినతులను స్వీకరించారు. స్పందనకు వచ్చిన 257 వినతుల్లో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 203 ఉన్నాయి. మిగిలిన వాటిలో గ్రామ సచివాలయాల శాఖ 19, డీఆర్‌డీఏ 9, జిల్లా పంచాయతీ అధికారివి 4, హౌసింగ్ 10, మున్సిపల్‌కి 3, డీసీహెచ్‌ఎస్‌కు 3 మిగిలినవి ఇతర శాఖలకు చెందినవిగా ఉన్నాయి. వినతులను సకాలంలో పరిష్కరించాలని జేసీ మయూర్ అశోక్ జిల్లా అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుల పట్ల స్పందించి బాధితులకు సత్వరన్యాయమందించాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 45 ఫిర్యాదులను ఆమె స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్‌లు ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక అంశాలపై 170 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎంఎన్.రాణి, లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎన్.మూర్తి, రవాణాశాఖాధికారి మల్లికార్జున రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ డీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ జేఆర్.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన నేరుగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన పోలీస్ అధికారులతో మాట్లాడుతూ స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసుస్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణమే న్యాయం అందించేలా చర్యలు తీసుకుని చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ ఎన్.వి. ప్రభాకర్ రావు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీపురం: వినతులను స్వీకరిస్తున్న జేసీ గోవిందరావు



పార్వతీపురం టౌన్: బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్

వైఎస్సార్‌సీపీ హయాంలోనే సామాజిక సాధికారత

● డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



స్థల పరిశీలన చేస్తున్న యాత్ర పరిశీలకులు ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యే జోగారావు

రామభద్రపురం: మోసపూరిత హామీలివ్వడంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆరితేరిన ఘనుడని డిప్యూటీ సీఎం పి.రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు అన్నారు. ఈ నెల 8వ తేదీన సామాజిక సాధికార బస్సు యాత్ర సాలూరులో నియోజకవర్గంలో జరగనున్నందున సామాజిక సాధికార యాత్ర ఇన్‌చార్జి, ప్రభుత్వ విప్ ఎంఎల్‌సీ లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల పథకం రాష్ట్ర వైస్‌చైర్మన్ నారాయణమూర్తిలతో కలిసి సోమవారం వారు మండలంలోని బూశాయవలస వద్ద ఓ ప్రైవేట్ కల్యాణ మంటపం దగ్గర స్వాగత ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. నియోజకవర్గ నాయకులకు బస్సుయాత్ర స్వాగత ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల రుణాలు, మహిళలకు డ్వాక్రా రుణాల మాఫీ చేస్తానన్న హామీతో 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తూతూమంత్రంగా మాఫీచేస్తూ వారికి ఆవేదన మిగిల్చారన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు అవకాశం ఇస్తే రాష్ట్రప్రజల జీవన విధానం అధోగతి పాలవుతుందని ఆందోళన వెలిబుచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే సామాజిక సాధికారత సాధ్యమైందని అన్నారు. జగనన్న ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చి, ప్రజా విశ్వాసం కూడగట్టుకున్నారు. అవినీతి అనకొండ చంద్రబాబు పాలనకు,సంక్షేమ సారథి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు మధ్యనున్న తేడాను ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణ రాజు, నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ మండల నాయకులు అప్పికొండ లక్ష్మునాయుడు తదితరులు పాల్గొనారు.

సామాజిక సాధికార యాత్ర స్థల పరిశీలన

పార్వతీపురంటౌన్: ఈనెల 10న పార్వతీపురం పట్టణంలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమానికి సంబంధించి ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో యాత్ర పరిశీలకులు ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు సోమవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో సామాజిక సాధికార యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలిసారిగా పార్వతీపురం విచ్చేసిన ఎమ్మెల్సీలను ఎమ్మెల్యే జోగారావు సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీనియర్స్ బాక్సింగ్ పోటీలకు 13 మంది ఎంపిక

● 13 నుంచి విశాఖలో రాష్ట్రస్థాయి పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం:

రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ పురుషుల బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో గల బాక్సింగ్ హాల్‌లో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో 50 మంది తలపడ్డారు. మొత్తం 13 కేటగిరీల బరువుల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారులు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు విశాఖలో గల స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియంలో జరగనున్న అంతర్ జిల్లాల బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్ తెలిపారు. ఎంపిక పోటీలను శాప్ బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్.ఈ రాజు, రింగ్ ఆఫీషియల్స్ వి.సంతోష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, పి.రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పార్వతీపురంటౌన్: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పార్వతీపురం నియోజకవర్గం విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు మండలంలోని తాళ్లబురిడి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుంధతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వండాన రోహిత్‌ను అభినందించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 1,2,3 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రిథమిక్ యోగా పోటీల్లో రోహిత్ అండర్–14 విభాగంలో రజతపతకం సాధించాడని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీ చిట్టిబాబు, ఉపాధ్యాయులు, మిరియాల సురేష్‌కుమార్, నారాయణరావు, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గొట్టివలసలో ఏనుగుల గుంపు



గొట్టివలసలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస పరిసరాల్లో సోమవారం ఏనుగులు సంచరించింది. పదిహేను రోజుల నుంచి గొట్టివలస, గరుగుబిల్లి, దళాయివలస, పెద్దూరు తదితర గ్రామాల పరిధిలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో సంచరించి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగులు ప్రధాన రహదారిని ఆనుకుని సంచరిస్తుండడంతో ప్రజలు రాకపోకలు చేసేందుకు భీతిల్లుతున్నారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వెబ్‌సైట్‌లో జీడీఏ పోస్టుల తుదిజాబితా

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి వారి పరిధిలో ఖాళీగా ఉన్న ఆడియో మెట్రిసిన్, జనరల్ డ్యూటీ అటెండెంట్(జీడీఏ), ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు సంబంధించి ఫైనల్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీసీహెచ్ఎస్ బి.గౌరీ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 9వతేదీన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న డీసీహెచ్ఎస్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని స్పష్టం చేశారు.

యూనియన్ బ్యాంక్ అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

విజయనగరం అర్బన్: అవినీతి చర్యలను వ్యతిరేకిస్తూ పట్టణ వీధుల్లో యూనియన్ బ్యాంక్ సిబ్బంది ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అవినీతి, లంచగొండితనంపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో పట్టణంలోని కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్ల కూడలి మీదుగా గంటస్తంభం వరకు ర్యాలీ చేపట్టారు. 'సే నో టు కరెప్షన్' బ్యానర్, ప్లకార్డ్స్‌తో ర్యాలీలో నినాదాలు చేశారు. అదేవిధంగా సేవాకార్యక్రమంలో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన శిబిరంలో పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పి.నరేష్, డిప్యూటీ రీజనల్ హెడ్ మాధురి, విజిలెన్స్ అఫీసర్ ఐ.వెంకటకృష్ణ, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న కోమలి

పార్వతీపురంటౌన్: కురుపాం మండలంలోని జోగిరాజుపేట గ్రామంలో ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒకే గ్రామానికి చెందిన రావివలస కోమలి, ప్రవీణ్‌లకు వివాహమై 12 సంవత్సరాలు పూర్తయ్యింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కోమలిపై భర్తకు అనుమానం ఉండడంతో నిత్యం వేధిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఆమెను కొట్టడం, తిట్టడం ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగేసింది. ఈ విషయం తెలుసుకున్న భర్త కురుపాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చే పడుతున్నారు.

మరో విద్యార్థిని..



చికిత్స పొందుతున్న అఖిల

జియ్యమ్మవలస మండలం బొడ్డవలస గ్రామంలో సోమవారం ఓ విద్యార్థిని ఆత్మహత్యా యత్నం చేసింది. ఈ ఘటనపై జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొండగొర్రి అఖిల బొబ్బిలిలోని లక్ష్మమ్మ ఒకేషనల్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్ రెండోసంవత్సరం చదువుతోంది. ఆమె స్నేహితురాలు మండంగి మాధురికి నాలుగు నెలల క్రితం తన బంగారు చెవి రింగులు ఇచ్చింది. ఈ మధ్య అఖిల తల్లి చెవి రింగుల గురించి అడగ్గా స్నేహితురాలికి ఇచ్చానని చెప్పింది. అయితే వెళ్లి తీసుకురా అని తల్లి డిమాండ్ చేయడంతో మాధురికి ఫోన్ చేసి అడగ్గా ఇస్తానని చెప్పి ఇవ్వకుండా విశాఖపట్నం వెళ్లిపోయింది. దీంతో విశాఖపట్నం వెళ్లి మాధురిని చెవిరింగులు అడగ్గా నేనివ్వను ఎవరితో చెప్పుకుంటావు చెప్పుకో అని బెదిరించింది. ఈ క్రమంలో ఇంట్లో మందలిస్తారన్న భయంతో ఆందోళన చెందిన అఖిల పురుగు మందు తాగేసింది. తల్లిదండ్రులు గమనించి 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

సభ్యులుగా చేరండి

● యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌరీశంకర్

విజయనగరం ఫోర్ట్: రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరి ప్రజలకు సేవలు అందించాలని యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ యాప్‌పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విపత్తులు సంభవించినప్పుడు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సేవలందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధన్‌నాయుడు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

120లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: మండలంలోని ఆర్‌కె బట్టివలస గ్రామ సమీపంలో ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర సోమవారం తనిఖీలు నిర్వహించి 120లీటర్ల సారా, బైక్‌ను స్వాధీనం చేసుకుని ఓ నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం నుంచి పార్వతీపురం పట్టణానికి సారా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామని తెలిపారు. పార్వతీపురం మున్సిపాల్టీలోని రెల్లివీధికి చెందిన శ్రీకాంత్, సొండి సురేష్‌లు ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి సారా రవాణా చేస్తుండగా వారి నుంచి 120 లీటర్ల సారా, బైక్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అయితే సొండి సురేష్ పరారీలో ఉన్నాడని, సాధ్యమైనంత త్వరలో అరెస్టు చేస్తామన్నారు. శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని తెలిపారు. దాడుల్లో ఎస్సై రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.4.5కోట్లు పైబడి డ్వాక్రా బజార్ అమ్మకాలు



సేంద్రియ ఎరువుల పంట ఉత్పత్తుల ప్రదర్శన



జూట్ నుంచి తయారు చేసిన గృహోపసరాల వస్తువులు

విజయనగరం అర్బన్: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న అఖిలభారత డ్వాక్రా బజార్‌లో పొదుపు మహిళల ఉత్పత్తులకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది.డ్వాక్రా బజార్‌లో ఇంతవరకు రూ.4.5 కోట్లు దాటి వ్యాపారం జరిగిందని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి సోమవారం తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మరో రెండురోజుల్లో ప్రదర్శన ముగుస్తుందని చెప్పారు. 15 రాష్ట్రాల పొదుపు సంఘాల ఉత్పత్తులతో పాటు జిల్లాకు చెందిన మెంటాడ, ఎల్.కోట, నెల్లిమర్ల, డెంకాడ, వంగర, చీపురుపల్లి, సంతకవిటి, గుర్ల, గంట్యాడ, నెల్లిమర్ల, గజపతినగరం, విజయనగరం మున్సిపాలిటీల నుంచి తినుబండారాలు, హస్తకళలు, ఆభరణాలు, భీమాళి మామిడి తాండ్ర, రెడీమేడ్ దుస్తులు, అగరవత్తులు, పూజాసామగ్రి, ఎంటీపీ స్టిక్స్ (తుడుపు కర్రలు) తదితర ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్‌లో అమ్మకాల తాకిడి పెరుగుతోంది.

అంతర్ వర్సిటీ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థి



ఇ.సూర్యప్రకాశ్

రాజాం సిటీ: ఈ నెల 9 నుంచి 12 వరకు జేఎన్‌టీయూ కాకినాడలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థి ఇ.సూర్యప్రకాశ్ ఎంపికయ్యాడని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీలలో జేఎన్‌టీయూ జీవీ విజయనగరం తరఫున పాల్గొని ఎంపికయ్యాడని చెప్పారు. విద్యార్థి ఎంపికపట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, డీన్‌లు ఎంవీ నాగేశ్వరరావు, వి.రాంబాబు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.